క్లుప్తంగా

చురుగ్గా వేంకటేశ్వర ఆలయ నిర్మాణం



నిర్మాణంలో వేంకటేశ్వర స్వామి ఆలయం

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరిడిమాంబ ఆలయం ఎదురుగా తిమ్మరాజుపేటలో స్వామివారి ఆలయ నిర్మాణం చేపడుతున్న సంగతి తెలిసిందే. భక్తులు ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

డాబాల్లో మద్యం విక్రయిస్తే కేసులు



ఉమ్మలాడ డాబాలో ఫ్రిజ్‌లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక: డాబాల్లో ఎవరైనా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ పి.ప్రసాదరావు హెచ్చరించారు. మండలంలోని పలు డాబాల్లో ఆయన సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. అనధికారికంగా మద్యం విక్రయించినా, మాంసం నిల్వ ఉంచినా నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. డాబాల్లో మద్యం తాగినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

30 లీటర్ల సారా స్వాధీనం



ఎక్సైజ్ సీఐ స్వాధీనం చేసుకున్న సారా బ్యాగ్

పాయకరావుపేట: మండలంలో శ్రీరాంపురం గ్రామ పరిధిలో దాడులు నిర్వహించి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. సమాచారం మేరకు సారా కలిగి ఉన్న మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి యలమంచిలి కోర్టుకు తరలించామన్నారు.

పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు చట్టాలు



మాట్లాడుతున్న విద్యార్థిని

యలమంచిలి రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పని ప్రదేశాల్లో మహిళల రక్షణ, లింగ సమానత్వం అంశంపై వారు పోటాపోటీగా తమ భావాలను వ్యక్తీకరించారు. అనంతరం మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై కె. సావిత్రి, న్యాయవాదులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ 'గాదె' గెలుపుపై హర్షం



సంబరాలు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు గెలుపొందడం పట్ల పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ధర్మవరం అగ్రహారం పాఠశాలలో ఉపాధ్యాయులు గార ప్రకాష్, శ్రీనివాసరావు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలు తినిపించుకుని సందడి చేశారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



ఎస్.రాయవరం: అడ్డురోడ్డులో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామివారికి సిందూర, తమలపాకు పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ఉత్సవ మూర్తిని భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

‘పందూరు వంతెన’కు గ్రహణం




గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరు..

గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్ వంతెన నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో ఎన్నికల కోడ్ రావడంతో టెండర్ ప్రక్రియలో ఆగిపోయింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులతో వంతెన పూర్తి చేసేందుకు అవకాశం ఉంది. అయినా మీనమేషాలు లెక్కిస్తోంది. పైగా వంతెన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందంటూ ప్రచారం చేస్తున్నారే తప్ప నిర్మాణం చేసే ఆలోచన కనిపించడంలేదు.

–కిల్లాడ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు

- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.4.50 కోట్ల మంజూరు
- ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణానికి బ్రేకులు
- మీనమేషాలు లెక్కిస్తున్న కూటమి ప్రభుత్వం
- నెరవేరని హోం మంత్రి అనిత హామీ



వరాహానదిలో అసంపూర్తి నిర్మాణంతో మిగిలిన పిల్లర్లు



వరాహనదిలో తాత్కాలికంగా వేసిన గ్రావెల్ రోడ్డు

కోటవురట్ల: పందూరు వంతెన.. ఎన్నో ఏళ్ల కల.. అదిగో ఇదిగో అంటూ ఏళ్లు గడిచిపోతున్నాయే తప్ప వంతెన మాత్రం అందుబాటులోకి రాలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో నిధులు మంజూరైనా ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆ కల నిజమయ్యే తరుణంలో నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. పందూరు వరాహనదిపై వంతెన నీలం తుపానులో వచ్చిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి పందూరువాసులకు కష్టాలు మొదలయ్యాయి. అప్పట్లో ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీలో చెరకు గానుగాడేవారు. కోటవురట్ల మండలం నుంచి అత్యధికంగా చెరకు సరఫరా అయ్యేది. పందూరు, గొట్టివాడ ప్రాంతాలలో ఎక్కువగా చెరకు పండించేవారు. తుపాను తాకిడికి వంతెన కొట్టుకుపోవడంతో అన్ని వర్గాల ప్రజలకు ఇక్కట్లు మొదలవ్వగా, ప్రధానంగా చెరకు రైతు నానా అవస్థలు పడేవాడు. ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసేందుకు పడరాని పాట్లు పడేవారు. చుట్టూ అదనంగా పది కిలో మీటర్లు ప్రయాణించి చెరకు సరఫరా చేసేవారు. రైతుల ఇబ్బందులను గుర్తించిన అప్పటి కలెక్టర్ చొరవతో వరాహనదిలో రూ.50 లక్షలతో గ్రావెల్‌తో తాత్కాలికంగా రోడ్డు వేశారు. అప్పటి నుంచి నదిలో రాకపోకలు మొదలయ్యాయి. అయినా వర్షాకాలంలో ఇక్కట్లు తప్పేవికావు. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురిసినా నదిలో వరదనీటి ఉధృతితో రాకపోకలు బంద్ అయ్యేవి.

2014 ఎన్నికల ముందు టీడీపీ అభ్యర్థిగా ఉన్న ప్రస్తుత హోం మంత్రి వంగలపూడి అనిత పందూరు వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. 2014లో అధికారంలోకి వచ్చాక రెండేళ్లు గడిచాయి. ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి ప్రారంభమైంది. దాంతో అప్పట్లో రూ.2 కోట్లు మంజూరు చేయగా పిల్లర్ల స్థాయి వరకు నిర్మించి నిధులు చాలవంటూ కాంట్రాక్టరు చేతులెత్తేశాడు. కల నెరవేరుతుందని ఆశించిన పందూరు ప్రజలకు ఆశాభంగమైంది. అప్పటి నుంచి ఆ పిల్లర్లే మిగిలాయి. తప్ప వంతెన మాత్రం రాలేదు. ఏళ్లు గడిచాయి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ వంతెన నిర్మాణానికి రూ.4.50 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ ప్రారంభమయ్యే సమయానికి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దాంతో మళ్లీ వంతెన నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. గత ఎన్నికల ముందు మళ్లీ కూటమి వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చింది. కానీ నేటికీ నెరవేరకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఉన్నప్పటికీ వంతెన నిర్మాణానికి పట్టిన గ్రహణం మాత్రం వీడలేదు. దాంతో వంతెన కల ఎప్పటికైనా నెరవేరుతుందా అన్న అనుమానాలు మొదలయ్యాయి.

వర్షాకాలంలో ప్రాణసంకటమే..

వంతెన లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. తక్కువ వరదనీటి ప్రవాహం ఉన్నప్పుడు కొంత మంది ప్రాణాలకు తెగించి గ్రావెల్ రోడ్డు మీదుగా వెళ్లే వారు అటువంటి సమయంలో ప్రమాదవశాత్తు జారి గల్లంతైన సంఘటనలు ఉన్నాయి. ఇలా ఇద్దరు వ్యక్తులు ఈ నదిలో గల్లంతైన సందర్భాలు ఉన్నాయి. విద్యార్థులు హైస్కూల్‌కు వెళ్లాలన్నా... అడ్డురోడ్డు వెళ్లాలన్నా.. ఈ నదిని దాటాల్సిందే. వంతెన లేకపోవడంతో నదిలో నుంచే వెళ్లడం పరిపాటిగా మారింది. వర్షాకాలం మినహా మిగతా కాలాలలో రాకపోకలు యధావిధిగా సాగుతుండగా వర్షాకాలంలో మాత్రం బంద్ అవుతున్నాయి.



వంతెన పూర్తి చేయాలి..

వంతెన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చొరవ చూపాలి. రాజకీయం చేయకుండా వంతెన నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలి. ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. ఇంకా కాలయాపన చేస్తే ప్రజలకు కష్టాలు కొనసాగుతూనే ఉంటాయి.

–టి.నారాయణరావు, మాజీ సర్పంచ్, పందూరు

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



వాడ్రాపల్లిలో వరికి సోకిన తెగుళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి, టి.సిరసపల్లి గ్రామాల్లో మంగళవారం శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ రమణమూర్తి, అగ్రానమీ డాక్టర్ పద్మావతి రైతులకు పలు సూచనలు చేశారు. వాడ్రాపల్లిలో వరికి అగ్గి తెగులు సోకినట్లు గుర్తించారు. నివారణకు అమిస్టార్ మందును 200 మిల్లీలీటర్ల వంతున ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. మిరపలో త్రిప్స్ ఎక్కువగా ఉన్నాయని, నివారణకు ఫిప్రోనిల్ మందును ఎకరాకు 400 మిల్లీ లీటర్ల వతున పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు, నువ్వు పంటలకు కత్తెర పురుగు సోకుతుందని, నివారణకు గాను ఈమామెక్టిన్ బెంజోయేట్ మందును పిచికారీ చేయాలని సూచించారు. పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట సీహెచ్‌వో జ్యోత్స్నకుమారి, ఏఈవో శ్రీను, లక్ష్మి, వీహెచ్ఏ తులసి, వీఏఏ సింధూజ తదితరులు పాల్గొన్నారు.

పాల పోటీలను విజయవంతం చేయండి



సమీక్ష చేస్తున్న డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ నరసింహులు

కోటవురట్ల: విజయనగరంలో ఈ నెల 14 నుంచి జరగనున్న పాల పోటీలలో పాడి రైతులు పాల్గొనాలని డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ నరసింహులు కోరారు. మంగళవారం స్థానిక మండల పశు వైద్యశాలలో మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు చెందిన పశు వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలపోటీలకు ఎంపిక చేసిన హెచ్‌ఎఫ్, ముర్రా, జెర్సీ జాతులకు చెందిన పాడి పశువులను తగు జాగ్రత్తలతో తరలించాలని సూచించారు. రెండు మండలాలలో ఈ నెలాఖరు వరకు పశుగణన జరుగుతుందని, ఇప్పటి వరకు 96 శాతం నమోదు పూర్తయినట్టు తెలిపారు. ప్రతీ పాడి పశువుకు బీమా చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీ డాక్టరు పెట్ల నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

250 ఎకరాల భూముల ఆక్రమణపై ఫిర్యాదు



ఆర్డీవో కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ వైస్ ఎంపీపీ అప్పలరాజు

ఎస్.రాయవరం: మండలంలోని పెదఉప్పలం రెవెన్యూ పరిధిలో 250 ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయని ఫిర్యాదు చేస్తే మండల రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదని వైఎస్సార్‌సీపీ వైస్ ఎంపీపీ బోడిపల్లి అప్పలరాజు వాపోయారు. దీనిపై నర్సీపట్నం ఆర్డీవో రమణకు మంగళవారం ఫిర్యాదు చేశానన్నారు. సర్వే నంబర్లు 428 ,489లో సబ్ డివిజన్ 10 వరకు, 495, 492, 499 ఇలా సుమారు 50 సర్వే నంబర్లకు సంబంధించి భూములు అన్యాక్రాంతమయ్యాయని, వీటిని సమగ్ర సర్వే నిర్వహించి భూ ఆక్రమణలు తొలగించాలని కోరారు. వీటిపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేస్తామన్నారు.

ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ తరగతులు

ఏయూ వీసీ రాజశేఖర్



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బందికి విభిన్న విభాగాలు, అంశాలపై విస్తృత అవగాహన కల్పించేలా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తానని వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. మంగళవారం అకడమిక్ సెనేట్ మందిరంలో వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు, సూపరింటెండెంట్లు, ఇతర విభాగ అధిపతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను పరిరక్షిస్తూ, మరింత పెంపొందించే దిశగా ప్రతి ఉద్యోగి పని చేయాలని సూచించారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో మరింత వేగంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం, సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎస్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి అభినందనలు

ఏయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జీపీ రాజశేఖర్‌ను వర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్లు ఆచార్య బీలా సత్యనారాయణ, ఆచార్య జీఎస్ఎన్ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిష్టాత్మక ఏయూకు వీసీగా నియమితులవడం అభినందనీయమన్నారు.

వందేళ్ల ఉత్సవాల్లో భాగస్వాముల్ని చేయండి

ఆంధ్ర యూనివర్సిటీ వందేళ్ల ఉత్సవాల్లో తమను భాగస్వాముల్ని చేయాలని వర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు వీసీ రాజశేఖర్‌ను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శిరీష్, విక్రమ్, సురేంద్ర, దాస్, త్రినాథ్, పట్నాయక్, దంతేశ్వరి, సులోచన, జ్యోతి రమ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆంధ్ర యూనివర్సిటీలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్‌ను కలిసి క్యాంపస్ కాలేజీలు, వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ రాకపోవడంతో నెలకు విద్యార్థుల నుంచి రూ.3,500లకు పైగా ఫీజును వసూలు చేస్తున్నారన్నారు. ఫీజు చెల్లించని సందర్భంలో విద్యార్థుల హాస్టల్ మెస్ కార్డులను నిలిపివేస్తున్నారని వీసీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వీసీకి వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి రూరల్: విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం యలమంచిలి 33/11కేవీ ఉపకేంద్రం రాంబిల్లి రూరల్ ఫీడర్ పరిధిలో బుధవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెం, కట్టుపాలెం , రామారాయుడుపాలెం గ్రామాలకు యలమంచిలి, ఎర్రవరం, కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అవకాశం ఉన్నచోట ఉదయం 2 గంటల నుంచి 10 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో..

ఎస్.రాయవరం: మండలంలో కొరుప్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వమ్మవరం, అగ్రహారం గెడ్డపాలెం గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైనులో చెట్టుకొమ్మలు తొలగింపులో భాగంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందన్నారు.

ఆశా వర్కర్ల ఒప్పంద జీవో అమలు చేయాలి

అచ్యుతాపురం రూరల్: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు కనీస వేతనాలు అమలు చేసి ఒప్పంద జీవో అమలు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలపై మంగళవారం హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు మంగమ్మ, దుర్గ, సరోజిని, సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

పెట్టుగోళ్లపల్లిలో ప్రకృతి సేద్యానికి ప్రణాళిక



ప్రకృతి సేద్యంతో పండించిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఎస్.రాయవరం: వచ్చే ఖరీఫ్ సీజన్‌కు పెట్టుగోళ్లపల్లి గ్రామంలో వంద శాతం ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ప్రకృతి వ్యవసాయం డీపీఎం సీహెచ్ లత్సన్న తెలిపారు. గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఇక్కడ సాగునీటి స్థితిగతులు పరిశీలించి ప్రకృతి సాగుకు సిద్ధమవుతున్నామన్నారు. ఇప్పటికే పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం చేశారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ వెలుగ ఏపీఎం శివప్రసాద్, ఏవో సౌజన్య, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి.. ఐదుగురిపై కేసు



పట్టుబడ్డ పేకాటరాయుళ్లు

పరవాడ: వెన్నలపాలెం సమీపంలో పేకాట శిబిరంపై పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐ మహాలక్ష్మి తన సిబ్బందితో మంగళవారం రాత్రి దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.35 వేలు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో ఎస్‌తోపాటు సిబ్బంది కనకరెడ్డి, వల్లి, మురళీ, మోహన్‌ప్రసాద్, రాము నాయుడు పాల్గొన్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారం మేలు



చూచుకొండ పీహెచ్‌సీ ఆవరణలో మానవహారం



బృందావనంలో మహిళల ప్రతిజ్ఞ

మునగపాక: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాజా ఆహారంతో పాటు కాయగూరల భోజనం తీసుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు సరైన పోషకాహారం తీసుకోవడం మంచిదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కిశోర బాలికలు యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బృందావనం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో మంగళవారం కార్యకర్తలు, మహిళలు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సౌజన్య మాట్లాడుతూ సమాజంలో మహిళలు పోషించాల్సిన పాత్ర, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. బాలికల పోషణ, వారు బాగా చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. మొక్కలు నాటడం, బాల్య వివాహాలు నిర్మూలన, ప్రతిజ్ఞ తదితర అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా మహిళలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

అచ్యుతాపురం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు పోషకాహారం, యోగా, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. రోజూ యోగా చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమంటూ తద్వారా వాటి అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ఉమాదేవి, ఈశ్వరి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కె.పైడికొండ, జి.అపరంజిని పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండలంలో పెద బోదిగల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కొల్లేరు ఐటీఐ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ బి. గోపాలరాజు, ట్రైనీ ఆఫీసర్ మండపాటి కృష్ణ మంగళవారం అల్పాహారం సమకూర్చారు. ఇక్కడ పాఠశాలలో 45 రోజుల నుంచి పదో తరగతి విద్యార్థులకు రోజూ సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఐటీఐ నిర్వాహకులు మంగళవారం సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేశారు. రోజు దాతలు స్నాక్స్, అల్పాహారం సమకూరుస్తున్నారని హెచ్‌ఎం సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయుడు ఆచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఐటీఐ సిబ్బంది అరుణ్‌కుమార్, శ్రావణి శిరీష, ఉపాధ్యాయులు ఏవీఎల్ కుమారి, చిన్నారావు, రమేష్ బాబు, శ్రీదేవి పాల్గొన్నారు.

పిఠాపురానికి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు

- రూ.2.85 కోట్లతో అభివృద్ధి పనులకు ఒప్పందం



ఒప్పంద పత్రాన్ని ప్రదర్శిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ

పరవాడ: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల అభివృద్ధి కోసం సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం రూ.2.85 కోట్లు ఖర్చు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ, కాకినాడ చీఫ్ ప్లానింగ్ అధికారి మోహన్‌రావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఈ ఒప్పందం జరిగింది. సీఎస్సార్ నిధులతో గొల్ల ప్రోలు మండలంలో సీసీ రోడ్లు, పాఠశాలలు, జూ నియర్ కళాశాలలో సైన్స్ ల్యాబ్‌లు, సీహెచ్‌సీలో ఆక్సిజన్ ప్లాంట్, యు.కొత్తపల్లిలో కమ్యూనిటీ హాలు, పీహెచ్‌సీలో ఔట్ పేషెంట్ బ్లాక్ నిర్మాణాలు, పాఠశాలల్లో ఫర్నిచర్ సమకూర్చనున్నారు.